క్లుప్తంగా

తూనికలు, కొలతల విభాగం అధికారుల తనిఖీలు



హన్మకొండ చౌరస్తా: వినియోగదారుల ఫిర్యాదు మేరకు హనుమకొండ బస్టాండ్ ప్రాంతం, హనుమకొండ చౌరస్తా, టైలర్‌స్ట్రీట్ ప్రాంతాల్లో పండ్ల దుకాణాల్లో జిల్లా తూనికలు, కొలతల విభాగం అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. సుమారు 30 దుకాణాలను తనిఖీ చేయగా తూనికలు, కొలతల్లో ప్రమాణాలు పాటించకపోవడంతో 8మంది చిరువ్యాపారులపై కేసు నమోదు చేసి, రూ.4వేల జరిమానా విధించినట్లు చేసినట్లు డీఎల్ఎం అధికారి శ్రీదేవి తెలిపారు.

రోడ్డు పక్కన రెడిమిక్స్ పారబోయవద్దు



సాక్షి స్పందన

కాజీపేట అర్బన్: రోడ్డు పక్కన రెడీమిక్స్ వ్యర్థాలను పారబోయవద్దని రెడిమిక్స్ ప్లాంట్ల యజమానులను మడికొండ ఇన్‌స్పెక్టర్ పి.కిషన్ హెచ్చరించారు. సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన రోడ్డు పక్కనే రెడి మిక్స్ అనే కథనానికి మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ స్పందించారు. మడికొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మైన్స్ అండ్ జియాలజీ రాయల్టీ అధికారి చంద్రలేఖ ఆధ్వర్యంలో రెడి మిక్స్ ప్లాంట్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు.

నేడు గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు



ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా షహీద్ దర్గా ప్రాంగణంలో శుక్రవారం గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎండీ.జమీల్ తెలిపారు. ఈమేరకు దర్గాలో గురువారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

బరుపాటి గోపికి డాక్టరేట్



రామన్నపేట: నగరంలోని ఏవీవీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బరుపాటి గోపికి శారీరక విద్యలో రాజస్తాన్ రాష్ట్రం అల్వార్‌లోని సన్‌రైస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. క్రీడా శారీరక ప్రదర్శనపై మనో సామాజిక విధానాల ప్రభావం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గోపికి డాక్టరేట్ లభించింది. డాక్టర్ నల్లెల శ్రీనివాస్, ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షణలో గోపి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. కాగా, గోపి గతంలో సైకాలజీ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి సైకాలజిస్ట్, మోటివేటర్‌గా రాణిస్తున్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ



కాశిబుగ్గ: మండల స్థాయి కళాఉత్సవ్ పోటీల్లో శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి సాధించారని హెచ్ఎం శ్రావణ్‌కుమార్ తెలిపారు. శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మండల స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విద్య ఆవశ్యకతను వివరిస్తూ నాటకం వేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గైడ్ టీచర్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

'ప్రైవేట్'లో ఫీజులు తగ్గించాలి

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ నగరంలో ప్రైవేట్ స్కూళ్లు వసూలు చేస్తున్న అధిక ఫీజులను విద్యాశాఖ అధికారులు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని లాయర్ రమేష్ బాబు కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో సదుపాయాలు లేకున్నా అధికారులు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాల అక్రమార్జనకు అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని అధికారులకు లీగల్ నోటీసులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని అన్నారు.

జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్

- సిగ్నల్స్ వ్యవస్థ లేక కిట్స్ కూడలిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, ప్రయాణికులు



హసన్‌పర్తి కిట్స్ కూడలిలో నిలిచిన వాహనాలు



హసన్‌పర్తి: హనుమకొండ – కరీంనగర్ మార్గమధ్యలోని కిట్స్ జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు, బాటసారులు కోరుతున్నారు.

నిత్యం రద్దీగా..

కరీంనగర్, వరంగల్, పరకాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు కిట్స్ జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. వందలాది స్కూల్, కళాశాలల బస్సులు ఈ మార్గంలో నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ జంక్షన్ రద్దీగా ఉంటోంది. ఈ కూడలిని దాటాలంటే వాహనదారులకు కనీసం 20నివిషాల సమయం పడుతోంది. ఒకవేళ ట్రాఫిక్ స్తంభిస్తే అరగంట కూడా పట్టే అవకాశం లేకపోలేదు. ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ, ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడం సమస్య తీవ్రంగా ఉంటోంది.

ట్రాఫిక్ స్తంభిస్తే అంతే..

కిట్స్ జంక్షన్‌లో ఏదైనా వాహనం ఆగిపోయి ట్రాఫిక్ జామ్ అయితే వాహనాలు కిలోమీటర్ మేర ఆగుతాయి. దాంతో అరగంట పాటు వేచి చూడాల్సిన దుస్థితి. ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతం అవుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుపై అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్య తీసుకోవాలి.

ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి



జంక్షన్ కావడంతో పరకాల, కరీంనగర్, వరంగల్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ నుంచే బస్సులు ఎక్కి దిగుతారు. దీంతో పాటు విద్యాసంస్థలకు సంబంధించిన వందలాది బస్సులు ఈ మార్గంలో నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. దాంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈక్రమంలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి.

– నంది శ్రీనివాస్, స్థానికుడు

ఎమ్మెల్యే స్పందించాలి



ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుపై స్థానిక ఎమ్మెల్యే నాగరాజు, అధికారులు స్పందించాలి. సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి. రోజురోజుకు కిట్స్ జంక్షన్‌లో వాహనాల రద్దీ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

– మూల దేవేందర్, స్థానికుడు

ఓంకార్ స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలు



ఓంకార్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: భూస్వామ్య శక్తుల ఆగడాలపై మడమ తిప్పని పోరాటం సాగించి, వందల ఎకరాల భూములను పేదలకు పంచడంలో ఓంకార్ కీలకపాత్ర పోషించారని, ఆయన స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలు చేపట్టాలని సామాజిక ఉద్యమ నాయకుడు సోమ రామ్మూర్తి పిలుపునిచ్చారు. వరంగల్ 27వ డివిజన్ అబ్బనికుంటలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఓంకార్ 16వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదివాసుల భూమి హక్కు పత్రాల కోసం రైతాంగాన్ని ఐక్యం చేసి వారి సమస్యను చట్టసభలో ఓంకార్ లేవనెత్తారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఊరటి అంశాల రెడ్డి జిల్లా కోశాధికారి సిరుల రవీందర్, నాయకులు నాగేష్, పేరయ్య, బుచ్చిరెడ్డి, రాజేశ్వరరావు, మోహన్‌రావు, సాంబయ్య, సుధాకర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'జేఏసీ' సాధించింది ఏంటి?

హన్మకొండ: ఉద్యోగ జేఏసీ నాయకులు ఉద్యోగులకు సాధించింది ఏంటని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో ప్రత్యక్షంగా మాట్లాడి న్యాయం చేస్తారనే ఆశలేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంఘాలున్నాయని, వాళ్లందరిని పక్కన పెట్టి జేఏసీ నాయకులమని చెప్పుకుని తిరుగుతున్న వారు ఇప్పటి వరకు ప్రభుత్వంతో మాట్లాడి సాధించింది ఏమీ లేదని తెలిపారు. రాష్ట్రంలో ఎంతమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉన్నారు, మూల వేతనంలో ఎంత కట్ చేశారు, ప్రభుత్వానికి ఎంత ముట్టిందనే వివరాలు లేవని పేర్కొన్నారు. 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నా, పీఆర్‌సీ ప్రకటించకున్నా, ఇతర బిల్లులు ఈ – కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నా, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ప్రయోజనాలు పెండింగ్‌లో ఉన్నా నాయకులు ఎందుకు కిమ్మనడం లేదని ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 22, 23వ తేదీల్లో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్న అండర్ –15 రాష్ట్ర స్థాయి చెస్‌పోటీల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. వరంగల్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. చదరంగంతో మేధో సంపత్తి పెంపొందడంతో పాటు మానసికంగా చాలా చురుకుగా ఉంటారని చెప్పారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన నలుగురు బాలికలు, నలుగురు బాలురు.. నవంబర్‌లో తమిళనాడులో జరగనున్న జాతీయ స్థాయి చెస్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిత్యం వహిస్తారని వివరించారు. వివరాల కోసం 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు జన్ను రవి, వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య బాధ్యులు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

3రోజులు వాకర్స్‌కు అనుమతి లేదు

కేయూ క్యాంపస్: ఈనెల 19నుంచి 21వ తేదీ వరకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడా పోటీలను హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మూడు రోజులపాటు వాకర్స్‌కు అనుమతి లేదని పేర్కొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

విద్యారణ్యపురి: 317 జీఓ స్పౌజ్ బాధితులను న్యాయం చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కురుమ పున్నంచందర్, జిల్లా జనరల్ సెక్రటరీ దావు రమేష్ పటేల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డీఏలు విడుదల చేయాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు ఫారాలను చూపుతున్న టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు

విద్యారణ్యపురి: రాబోయే వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా ఉపాధ్యాయులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు కోరారు. హనుమకొండలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు మూడేళ్ల బోధన అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మోజెస్, హెచ్ఎం రామారావు, స్టాఫ్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతలను పూడ్చివేయాలి



పూలు చల్లి నిరసన తెలుపుతున్న నాయకులు

ఖిలా వరంగల్: అండర్ బ్రిడ్జి రోడ్డుపై ఏర్పడిన ప్రమాదకరమైన గుంతలను వెంటనే పూడ్చివేయాలని బీజేపీ నాయకుడు ముత్తినేని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి రోడ్డుపై జీవు అడ్డా వద్ద ఏర్పడిన భారీ గుంతల్లో బీజేపీ నాయకులు గులాబీ పూలు చల్లి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని కోరారు. కృష్ణ, రాజు, రాము, ఓదెలు, మల్లయ్య, మొగిలి, నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్

రామన్నపేట: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సూచించారు. వరంగల్ చౌరస్తా, ఆర్ఎస్‌టీ రోడ్డులోని దుకాణ యజమానులు, వర్కర్లు, బండి దుకాణాదారులు, కష్టమర్లకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయ కలుగకుండా నిర్దేశిత స్థలంలో వాహనాలను నిలపాలని తెలిపారు. రోడ్డుపై పార్కింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ప్రయాణాలు చేసే సమయంలో తప్పకుండా హెల్మెట్ వాడాలని చెప్పారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

సంస్కృత సాహిత్యంలో ఆదికవి, రామాయణ మహా కావ్యాన్ని లిఖించిన జ్ఞాననిధి వాల్మీకి మహర్షి జయంతిని నగరవ్యాప్తంగా ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



మడికొండ: వాల్మీకి జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ కావ్య, తదితరులు



ఎన్పీడీసీఎల్‌లో..



టీఎస్ఎస్పీ బెటాలియన్‌లో కమాండెంట్ రాంప్రకాశ్, అధికారులు



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న నాయకులు



ఏనుమాములలో..

ఆదివాసీల ఆత్మబంధువు కొమురం భీమ్



నివాళులర్పిస్తున్న సంగని మల్లేశ్వర్, బాధ్యులు



కేయూ మొదటి గేట్ వద్ద..

కేయూ క్యాంపస్: ఆదివాసీల ఆత్మబంధువు, తెలంగాణ విముక్తి కోసం నిజాం కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొమురం భీమ్ అని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ కొనియాడారు. క్యాంపస్‌లోని జర్నలిజం విభాగంలో కొమురం భీమ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, నాయకులు డాక్టర్ కొట్టి భాస్కర్, బిక్కూనాయక్, మోటె చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలి

కొమురం భీమ్ పోరాట స్ఫూర్తితో ఆదివాసీలు తమ హక్కులను సాధించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ సూచించారు. కేయూ ఆదివాసీ విద్యార్థుల ఆధ్వర్యంలో మొదటి గేట్ వద్ద కొమురం భీమ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీమ్ పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సాయి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



రాస్తారోకో చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని వామపక్షాల విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి అశోక్ జంక్షన్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ రాస్తారోకో చేశారు. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్సీన్‌సుల్తానా, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్, ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ పెండ్యాల సతీష్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు రాచకొండ రంజిత్, ఉట్కూరి ప్రణీత్, రోహిత్, మెరుగు రాకేష్, అర్జున్, వేల్పుల చరణ్, ముషారఫ్, రాకేష్, వినయ్, హర్ష అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సభ్యత్వ నమోదుకు స్పందన

వరంగల్ చౌరస్తా: బీజేపీ మహిళా మోర్చా సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ తెలిపారు. వరంగల్ చౌరస్తాలో మహిళా మోర్చా సభ్యత్వ నమోదు కార్యక్రమం కాసు శిల్ప ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా 57 వేల సభ్యత్వాలు పొందినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సభ్యత్వ జిల్లా ప్రముఖ్ కుసుమ సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా, మహిళా మోర్చా నాయకురాలు రేపల్లె స్వర్ణ, తోటకూరి రాజేశ్వరి, మార్త ఉష, పిట్ట సరస్వతి, ఐతం స్వరూప, దేవిక, అపర్ణ, శర్వ, బీజేపీ నాయకులు బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మిగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప, ఓంకారేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో సంకటహర లక్ష్మిగణపతి విగ్రహాన్ని గురువారం పున ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో దాసరి రాజేష్, సామల సదానందం, రామ వెంకటనారాయణ, బొట్ల సుధాకర్, కూచన రవీందర్, నరసింహ, అర్చకులు శ్రీకాంతాచారి, మధుచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి బోనాలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందరాజుల గుట్ట వద్ద పెద్దమ్మతల్లి బోనాల వేడుకను గురువారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, ముదిరాజ్ కులపెద్దలు చింతాకుల సునీల్, బయ్య స్వామి, కులస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శిరబోయిన మహేష్, గంద్ర చందర్, గోపి, శివ, రాజేష్, సత్యం, గోవిందు, రాజేందర్, రమేష్, రాజు, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన మాచర్ల సరస్వతి (60) అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ గురువారం పరామర్శించారు. బాధితులను పరామర్శించిన వారిలో నాయకులు వినోద్, కుమార్‌బాబు, ఆకుల శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి..

హసన్‌పర్తి: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన టీయూడబ్ల్యూజే (హెచ్ 143) జిల్లా ప్రధాన కార్యదర్శి నాయకపు సుభాష్ కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బండి రజినికుమార్, డివిజన్ అధ్యక్షుడు అచ్చం రవి, దేవస్థానం మాజీ చైర్మన్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న జంగా దంపతులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి దంపతులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు అందించి మహాదాశీర్వచనం చేశారు.

బార్‌లో గొడవ.. పలువురికి గాయాలు

కాశిబుగ్గ: 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీలోని ఇంద్రఖిలా బార్‌లో కొంతమంది యువకులు మద్యం మత్తులో గురువారం రాత్రి గొడవపడి కొట్టుకున్నారు. ఈ ఘటనలో కొందరికి గాయాలు కాగా, వారు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్‌కు చెందిన కొంతమంది యువకులు తన మిత్రుడి అమ్మ దహన సంస్కారాలకు వచ్చి అనంతరం ఇంద్రఖిలా బార్‌లో మద్యం తాగారు. అదే కార్యక్రమానికి వచ్చిన వంచనగిరికి చెందిన మరికొంత మంది యువకులు కూడా బార్‌లో మద్యం తాగుతున్నారు. ఈక్రమంలో బీరు విషయంతో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి గొడవపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ గొడవలో గాంధీనగర్‌కు చెందిన నలుగురికి తీవ్ర గాయాలు కాగా, వారు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు.

'విదేశీ విద్యాజ్యోతి' లబ్ధిదారుల సంఖ్యను పెంచాలి



హన్మకొండ: పూలే విదేశీ విద్యాజ్యోతి పథకం కింద విదేశాలకు పంపే బీసీ విద్యార్థుల లబ్ధిదారుల సంఖ్యను పెంచాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖను హనుమకొండలో గురువారం విడుదల చేసి శేషు మాట్లాడారు. ప్రస్తుతం ఈ పథకం కింద ప్రతి సంవత్సరం 300 మంది విద్యార్థులను మాత్రమే విదేశాలకు వెళ్లడానికి ఎంపిక చేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 130 బీసీ కులాలు, 54శాతం బీసీ సామాజిక వర్గం ఉందని అన్నారు. ఈ క్రమంలో లబ్ధిదారుల సంఖ్యను 300 నుంచి 2 వేలకు పెంచాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.20 లక్షలను రూ.30 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు.